నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శుక్రవారం 26 జూలై 2024 | SURYAPET

28న సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

మిర్యాలగూడ, జూలై 25 : నల్లగొండ, సూర్యాపేట జిల్లాల స్థాయి అండర్ -19 బాలబాలికల సబ్ జూనియర్ ఎంపిక పోటీలను ఈ నెల 28న మిర్యాలగూడ పట్టణంలోని క్లియో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ తోట రంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు డీఎస్ఏ కోచ్ రామకృష్ణను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో సెలెక్ట్ అయిన క్రీడాకారులను వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నామని, పూర్తి వివరాలకు 9948052108 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

బడ్జెట్‌లో మొండి'చెయ్యి'

జిల్లా ప్రజల ఆశలపై కాంగ్రెస్ సర్కారు నీళ్లు

యాదగిరిగుట్ట నర్సన్న ముచ్చటే ఎత్తలే..
ఐటీ హబ్ ఊసే లేదు

మెడికల్ కళాశాలకు నిధులు సున్నా
పరిగణలోకి తీసుకోని బస్వాపూర్ ప్రాజెక్ట్
గంధమల్ల రిజర్వాయర్‌ను పట్టించుకోలే..
కొత్త సంక్షేమ పథకాల ప్రస్తావన లేదు..
రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజల పెదవి విరుపు

రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు మొండిచెయ్యి చూపింది. కొత్త సర్కారులో కొత్త ప్రాజెక్టులు, నిధుల ఆశలు గల్లంతయ్యాయి. పాత వాటికి కూడా నిధులు కేటాయించని పరిస్థితి. బడ్జెట్‌లో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం ముచ్చటే ఎత్తలేదు. బస్వాపూర్ ప్రాజెక్ట్, గంధమల్ల రిజర్వాయర్లకు నిధుల ఊసులేదు. వంతెనలు, రోడ్లను పరిగణలోకి తీసుకోలేదు. ఎన్నికల ముందు చెప్పినట్లు కొత్త సంక్షేమ పథకాలను ప్రస్తావించకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

– సూర్యాపేట/యాదాద్రి భువనగిరి, జూలై 25 (నమస్తే తెలంగాణ)



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీలో పెట్టింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బిల్లును ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు జిల్లాకు అనేక హామీలు ఇచ్చింది. అధికారంలోకి రాగానే హామీలన్నీ నెరవేరుస్తామని వాగ్దానాలు చేసింది. తొలిసారి పూర్తి బడ్జెట్ కావడంతో జిల్లా ప్రజలు ఏమేం వస్తాయో అని భారీ ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి. ఇక ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు రూ. 2,500, విద్యా భరోసా, ఆసరా పింఛన్ల పెంపు, నిరుద్యోగ భృతి, ఆటో కార్మికులు, దళిత బంధు తదితర అనేక పథకాల ప్రస్తావనే తీసుకురాలేదు.

యాదగిరిగుట్ట ప్రస్తావన లేదు

తెలంగాణలో పెద్ద పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న యాదగిరిగుట్ట గురించి బడ్జెట్‌లో కనీసం ప్రస్తావించలేదు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో రూ. 1,200 కోట్లతో గుట్టను ఎంతగానో అభివృద్ధి చేశారు. ఇప్పటికీ కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. భక్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఇది నిరంతర ప్రక్రియ. వీటి కోసం నిధులు అవసరం. వివిధ పనుల కోసం రూ. 100 కోట్ల దాకా కావాలి. ప్రభుత్వం మాత్రం యాదగిరిగుట్టను పరిగణలోకి తీసుకోలేదు.

ఐటీ హబ్ ఏమాయే..?

ఎన్నికల ముందు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పలు హామీలు ఇచ్చారు. ఇందులో ఐటీ హబ్ ప్రధానమైంది. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, ఇందుకోసం ఐటీ హబ్‌ను తీసుకొస్తామని ఎన్నికల ప్రచారాస్త్రంగా మార్చుకున్నారు. కానీ బడ్జెట్‌లో మాత్రం ఐటీ జోలికే పోలేదు. ఎన్నికల్లో లబ్ధి కోసమే కుంభం ఐటీ హబ్ ప్రస్తావన తెచ్చారని, ఇప్పుడు మాత్రం పట్టించుకోవడంలేదని నిరుద్యోగులు మండిపడుతున్నారు.

మెడికల్ కాలేజీకి నిధులేవీ..?

గత బీఆర్ఎస్ సర్కారు యాదగిరిగుట్టకు మెడికల్ కాలేజీని మంజూరు చేసింది. కళాశాల నిర్మాణానికి రూ. 183 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. పాత కలెక్టరేట్ భవనంలో మెడికల్ కాలేజ్ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా మరమ్మతులు కూడా చే యించారు. కళాశాల ఏర్పాటుకు నిధులు అవసరం. కళాశాల నిర్మాణం, సదుపాయాలకు మాత్రం ఎలాంటి బడ్జెట్‌ను కేటాయించలేదు.

సాగు నీటి ప్రాజెక్టులను పట్టించుకోలే..

తుర్కపల్లి మండలంలో ఉన్న గంధమల్ల రిజర్వాయర్ పనులకు సంబంధించి గతంలోనే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. గంధమల్ల రిజర్వాయర్ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. బడ్జెట్‌లో దీన్ని పరిగణలోకి తీసుకోలేదు. ఇక వృథాగా పోతున్న మూసీ జలాలను సద్వినియోగం చేసుకుని ఆయకట్టును మరింత స్థిరీకరించేందుకు భువనగిరి నియోజకవర్గంలోని ధర్మారెడ్డి, పిలాయిపల్లి, బునాదిగాని కాల్వల ఆధునికీకరణ ఊసే లేదు. జనగామ జిల్లాలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి రాజాపేట, తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలకు దేవాదుల కాల్వ ద్వారా ఆలేరు, గుండాల మండలాలకు సాగు నీరందించే కాల్వలకు నిధులు కేటాయించలేదు.

బస్వాపూర్‌ను మరిచారు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బస్వాపూర్ (నృసింహసాగర్) ప్రాజెక్ట్‌ను తీసుకొచ్చారు. భువనగిరి మండలంలోని బస్వాపూర్ వద్ద 11.39 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే 90శాతం పనులు కూడా పూర్తయ్యాయి. ముంపు గ్రామాల ప్రజలు నష్ట పరిహారం, పునరావాసం కోసం ఎదురుచూస్తున్నారు. అన్ని రకాల పనులు కలిపి సుమారు రూ.500 కోట్లు అవసరం ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం బస్వాపూర్ ప్రాజెక్ట్‌కు నిధుల కేటాయింపు మరిచింది.

ట్రిపుల్ ఆర్, మూసీకి గంపగుత్తా నిధులు..

బడ్జెట్‌లో ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌కు రూ. 1,525, మూసీ నది ప్రక్షాళనకు రూ.1500 కోట్ల చొప్పున నిధులు కేటాయించారు. జిల్లాలో బీబీనగర్, పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట మీదుగా మూసీ నది ప్రవహిస్తున్నది. మూసీ నది ప్రక్షాళన డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కేటాయించిన నిధులు జిల్లా పరిధిలోని మూసీ పరిసర ప్రాంతాలకు ఎప్పుడు వస్తాయో వేచి చూడాలి. ఇక ట్రిపుల్ ఆర్‌లో భాగంగా ఉత్తర, దక్షిణ భాగాలకు కలిపి నిధులు ఇచ్చారు.

ఒట్టి మాటల బడ్జెట్

భట్టి పెట్టిందంతా ఒట్టిమాటల బడ్జెట్. అసలు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఈ బడ్జెట్ సరిపోతుందా. అన్ని రంగాలతోపాటు రైతాంగాన్ని మరోమారు మోసం చేసింద్రు. దళితబంధు ప్రస్తావన లేకుండా, యాదవులు, మత్స్యకారులు, గౌడన్నలు ఇలా కులవృత్తుల సంక్షేమాన్ని హరించేలా ఈ బడ్జెట్ ఉన్నది. కనీసం పేదలకు ఉపయోగపడే ఒక్క పాలసీ అయినా ప్రవేశపెట్టారా. ఒక్కటైనా కొత్త సంక్షేమ పథకం లేకుండా అన్ని రంగాల ప్రజలను మోసం చేశారు. ఈ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి పట్ల ఏ మాత్రమూ అవగాహన లేదనే విషయం ఈ బడ్జెట్‌తో స్పష్టమైంది. డంబాచారం, హంగు ఆర్భాటం తప్ప పసలేని బడ్జెట్‌తో కాంగ్రెస్ తన అసలు రంగు బయటపడింది.

–బడుగుల లింగయ్య యాదవ్,
మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు

పింఛన్ పెంపు ఊసేలేదు

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ఎన్నికలకు వెళ్లింది. గెలిచాక వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. పింఛన్ పెంపుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత బడ్జెట్‌లో దానికి నిధులు కేటాయించలేదు. పేదవాళ్లు తమకు వచ్చే పింఛన్ పెరుగుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. వారికి నిరాశే మిగిలింది. ఇక యాదవులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని కూడా మరచిపోయారు. మొత్తానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు నిరాశ కలిగించింది.

–జనిగ సైదులు,
మాజీ ఎంపీటీసీ, మేళ్లచెర్వు

బడ్జెట్‌లో బీసీలపై వివక్ష

రాష్ట్రంలో సగం జనాభా ఉన్న బీసీల పట్ల రేవంత్‌రెడ్డి సర్కారు బడ్జెట్‌లో వివక్ష చూపించింది. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఎలాంటి హామీ లేకుండా బీసీల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.10లక్షల కార్పొరేషన్ రుణాలు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పుడు బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదు. బీసీలకు కేటాయించిన నిధులు ఎలా సరిపోతాయి. రాష్ట్ర ప్రభుత్వం బీసీల పట్ల వ్యతిరేక ధోరణి ఉంటే దాన్ని సరి చేసుకోవాలి. లేకుంటే బీసీల ఆగ్రహం చూడాల్సి వస్తుంది.

– పాలకూరి రవి గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా
రాష్ట్ర అధికార ప్రతినిధి, నల్లగొండ

మహిళలకు రూ.2,500 సాయం మాటేలేదు

అధికారంలోకి వస్తే 18 ఏండ్లు నిండిన పేద మహిళలకు నెలకు 2,500 రూపాయలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో ఆ మాటెత్తలేదు. ఉచిత బస్సు ప్రయాణానికి 723 కోట్ల రూపాయలు కేటాయించగా రూ.2,500 ఇచ్చే దానిని పట్టించుకోలేదు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైంది. ఎంతో మంది మహిళలు ఈ పథకం వస్తుందని ఆశగా ఎదురు చూస్తుండగా ఈ బడ్జెట్‌తో నిరాశే మిగిలింది.

– గుత్తికొండ ప్రమీలావెంకటమణారెడ్డి,
కల్మల్‌చెర్వు, గరిడేపల్లి మండలం

విద్య, వైద్య రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

2లక్షల91వేల 159 కోట్ల రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి రూ.21,292 కోట్లు 7.3 శాతం మాత్రమే కేటాయించారు. వైద్యారోగ్య రంగానికి రూ.11,468 కోట్లు అంటే 3.9 శాతం కేటాయించారు. విద్యారంగానికి 15 శాతం కేటాయింపులు ఆశించగా అరకొర నిధులతో నాణ్యమైన విద్య, జీవన ప్రమాణ పెరుగుదల, ప్రభుత్వ బడులను బలోపేతం ఎలా సాధ్యమవుతుంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, వరికి బోనస్, మహిళలకు నెలకు రూ.2,500, ఆరోగ్యశ్రీ కేటాయింపులు జరుగలేదు. విధానాలు నిర్ణయించి కేటాయింపులు చేస్తామని ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క చెప్పడం సబబుగా లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా న్యూ ఇన్నోవేటివ్ పథకాలు ప్రకటిస్తుందని ఆశించగా బడ్జెట్ రూపకల్పన అలా జరుగలేదు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల సమస్యల పరిష్కారానికి కేటాయింపులు ప్రకటించలేదు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు ప్రస్తావనకు సంబంధించి ప్రతిపాదనలు చేయకపోవడం పట్ల ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

–బడుగుల సైదులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కోదాడ

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ సూర్యాపేటలో విద్యార్థులతో కలిసి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దివ్యాంగులను కాంగ్రెస్ మోసం చేసింది

కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులను నమ్మించి మోసం చేసింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 4,116 నుంచి రూ.6,116 చేస్తామని ప్రకటించడంతో ఆశతో కాంగ్రెస్‌కు ఓటేశారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా పెన్షన్‌ను పెంచలేదు. ప్రస్తుతం బడ్జెట్‌లో పెన్షన్ పెంపునకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో దివ్యాంగులకు తీవ్ర నిరాశతో ఉన్నారు.

–షేక్ నయీమ్, బీఆర్‌వీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, సూర్యాపేట

రైతు కూలీలకు సాయంపై స్పష్టతేది?

బడ్జెట్‌లో ప్రజా పంపిణీ, ఇండ్ల నిర్మాణం, విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని ప్రకటించగా దాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టంగా చెప్పలేదు. కోట్లాదిమందికి ఉపాధి కలిగించే ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధులు పెంచలేదు. వృద్ధులు, వితంతవులు, దివ్యాంగులు, ఇతర సామాజిక వర్గాల పెన్షన్ పెంపు ప్రస్తావన లేక పోవడం దురదృష్టకరం. మహాలక్ష్మి పథకానికి కేటాయింపులు లేకపోవడం మహిళలను మోసం చేయడమే.

–మట్టిపల్లి సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి

విద్యారంగం ప్రాధాన్యతను విస్మరించారు

విద్యారంగానికి బడ్జెట్‌లో కేవలం 7.31శాతం నిధులు కేటాయించడం సరైంది కాదు. కొంతకాలంగా మేధావులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్న మొండిచేయి చూపించారు. ఈ బడ్జెట్‌తో పేద విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించడం సాధ్యం కాదు. ఇది పేదలు, బలహీనవర్గాలను ఉద్దేశపూర్వకంగా అన్యాయం చేసినట్లే.

– ఎం.సోమయ్య,
డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

వెనుకబడిన ప్రాంతాలను పట్టించుకోలేదు

రాష్ట్ర బడ్జెట్‌లో సైతం వెనుకబడిన ప్రాంతాలను విస్మరించినట్లు ఉన్నది. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీల అమలుపై ఉన్న చిత్తశుద్ధి మిగిలిన సమ్యలపై లేదు. రైతు భరోసా, రైతు బీమా ఎప్పటి వరకు ఏ రకంగా అమలు చేస్తారో నిర్దిష్టంగా పేర్కొనలేదు. పెండింగ్‌లో ఉన్న శ్రీశైలం సొరంగం మార్గం పూర్తి చేయడానికి తగిన నిధులు, మూసీ ప్రాజెక్టు ఆధునీకరణ, పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాంచలేదు. డిండి ఎత్తిపోతల పథకానికి డీపీఆర్ ఆమోదంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరం. నియోజకవర్గానికి 3,500 గృహ నిర్మాణాలు చేపడితే ఇండ్లులేని నిరుపేదలకు ఎప్పటి వరకు పూర్తి అవుతాయి. ఆరోగ్యశ్రీని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్చి పేదలకు సత్వర వైద్యం అందేలా చూడాలి. ప్రజల సంక్షేమానికి తగ్గట్టుగా నిధులు ఖర్చు చేయాలి. లేనిచో ప్రజలను సమీకరించి నిర్మాణాత్మక పోరాటాలు చేస్తాం.

– ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి,
సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి

అనుమతుల్లేని ప్రైవేటు ఆస్పత్రులు సీజ్

నేరేడుచర్లలో అమ్మ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

నేరేడుచర్ల, జూలై 25 : నేరేడుచర్ల పట్టణంలో అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న రెండు ఆస్పత్రులను సూర్యాపేట జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ ఆదేశాను సారం సీజ్ చేసినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పున్న నాగిని తెలిపారు. గురువారం ఆస్పత్రులను సీజ్ చేసిన అనంతరం మాట్లాడారు. జాన్‌పహాడ్ రోడ్డులోని అమ్మ, శ్రీసాయి శ్రీనివాస ఆస్పత్రులను తనిఖీ చేసి రిజిస్ట్రేషన్, ఫార్మసీ, ల్యాబ్ టెక్నీషియన్, డ్యూటీ డాక్టర్స్ వివరాలను పరిశీలించామని, అనుమతులు లేకుం డా, నిబంధనలు పాటించకుండా నడిపిస్తున్నందున సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ నరసయ్య ఉన్నారు.

వదలని ముసురు

- వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన
- సగటులో 34 శాతం అదనంగా వర్షపాతం
- అయినా నిండని చెరువులు, పెరుగని భూగర్భ జలాలు

నల్లగొండలో..

నల్లగొండ, జూలై 25 : జిల్లాలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. రోజంతా చిరుజల్లులు కురవడమే తప్ప పెద్ద వాన మాత్రం పడలేదు. దాంతో బయటికి వెళ్లి పనులు చేసుకునే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. చిరుజల్లులతో గొడుగులు, ఇతర సంరక్షణ చర్యలు లేనిది బయటికి వెళ్లే పరిస్థితి లేదు. ఈ వర్షం పత్తి, వేరుశనగ, జొన్న తదితర పంటలకు మేలు చేయగా వరి సాగు చేసే రైతులకు అనుకూలంగా లేదు. తొలి మూడు రోజులు కురిసిన వర్షాలతో పత్తి పంటలు ఎదుగగా ఆతర్వాత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తి పంటకు నష్టం చేకూర్చే విధంగా పరిస్థితులు మారినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. గురువారం చిట్యాలలో 11.2 మిల్లీమీటర్లు, నార్కట్‌పల్లిలో 5.5, కట్టంగూర్, మునుగోడులో 2.6, శాలిగౌరారంలో 2.5, కనగల్‌లో 2.4, నకిరేకల్, మర్రిగూడలో 2.3, నాంపల్లిలో 1.5, నిడమనూరులో 1.1 మిల్లీమీటర్ల వర్షం పడగా మిగిలిన అన్ని మండలాల్లో ఒక మిల్లీమీటర్ కన్నా తక్కువ వర్షపాతం నమోదైంది.

వర్షపాతం పెరిగినా పడని నాట్లు

జిల్లాలో ఈ సారి రికార్డు స్థాయిలో వర్షం పడినట్లు వాతావరణ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 189.4 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 253.4 మిల్లీమీటర్ల వర్షం (34శాతం అదనం) పడినట్లు నమోదైంది. అయినా ఇప్పటి వరకు జిల్లాలో ఒక్క చెరువు కూడా నిండ లేదు. బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరుగలేదు. దాంతో వరి సాగు చేసే రైతులు నాట్లు వేయడానికి సంకోచిస్తున్నారు.

ఇంటింటి జ్వర సర్వే నిర్వహిస్తున్న ఆశ, అంగన్వాడీ టీచర్ (ఫైల్)

మున్సిపాలిటీల్లో జ్వర సర్వే

- నేటి నుంచి గడపగడపకూ వైద్య బృందాలు
- నల్లగొండ జిల్లాలో 182 బృందాల ఏర్పాటు.. వారం రోజుల కార్యాచరణ
- మందులకు జ్వరం తగ్గకపోతే ఆస్పత్రిలో చికిత్స

నీలగిరి, జూలై 25 : వాన ముసురుకున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులను కట్టడి చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో వైద్యారోగ్యశాఖ అధ్వర్యంలో జ్వరం సర్వే కొనసాగుతుండగా, పట్టణాల్లోనూ జ్వర పీడితులు పెరుగుతుండడంతో కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రత్యేకంగా అన్ని మున్సిపాలిటీల్లో ఇంటింటికీ సర్వే చేయాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం నుంచి వైద్య సిబ్బంది జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో ప్రతి ఇంటికీ వెళ్లి జ్వర లక్షణాలతో బాధపడే వారిని గుర్తించనున్నారు. అలాంటి వారికి వెంటనే మెడికల్ కిట్ అందించి, అవసరం ఉన్నవారిని సమీపంలోని పీహెచ్‌సీ లేదా యూహెచ్‌సీకి పంపి వైద్య పరీక్షలు చేయించనున్నారు. ఇందుకోసం 182 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్, మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్, మెప్మా ఆర్పీ, మున్సిపాలిటి సిబ్బంది ఉంటారు. ఒక్కో టీమ్ రోజూ 50 ఇండ్లను సందర్శించనున్నది.

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ

కొవిడ్ సమయంలో జ్వర సర్వే మంచి ఫలితాలు ఇచ్చింది. జనంలో అవగాహన కల్పించడం, ఇంటికే వెళ్లి మందులు ఇవ్వడంతో వైరస్ వ్యాప్తిని కట్టడి చేయగలిగారు. వారం నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జ్వర సర్వేకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ప్రధానంగా మురికివాడలు అధికంగా ఉండే ప్రాంతాలను ప్రధమంగా దృష్టి పెట్టనున్నారు. నల్లగొండ, మిర్యాలగూడ వంటి పెద్ద పట్టణాల్లో అవసరం మేరకు ఎక్కువ బృందాలు ఏర్పాటుచేయాలని వైద్యారోగ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జ్వర సర్వే వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయడంతోపాటు ఆన్‌లైన్ చేయనున్నారు. సాధారణ జ్వరం, జలుబు, దగ్గు ఉంటే మందులు అందించి ఆశ వర్కర్లు, ఎఎన్ఎంలు వారి ఆరోగ్య పరిస్థితిని మూడ్రోజులపాటు పర్యవేక్షిస్తారు. అప్పటికీ తీవ్రత తగ్గకపోతే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి వైద్య పరీక్షలు చేయించి, అవసరం మేరకు దవాఖానకు తరలించనున్నారు.

పెద్ద మున్సిపాలిటీల్లో అదనపు బృందాలు

కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని మున్సిపాలిటీల్లో ప్ర తి ఇంటికీ వైద్య బృందాన్ని పంపేందుకు చర్యలు తీసుకున్నాం. మున్సిపాలిటీల్లో వార్డుకు ఒక టీమ్‌ను ఏర్పా టు చేసి శిక్షణ ఇచ్చాం. నల్లగొండ, మిర్యాలగూడ మున్సిపాలిటీల్లో జనాభా ఎక్కువగా ఉన్నందున అక్కడ అదనంగా మరో కొన్ని వైద్య బృందాలను ఏర్పాటు చేయనున్నాం. జ్వర పీడితుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతోపాటు ఆన్‌లైన్ చేస్తాం. మందులకు కూడా జ్వరం తగ్గకపోతే ఆస్పత్రిలో అడ్మిట్ చేసి వైద్యం అందిస్తాం.

–డాక్టర్ కళ్యాణచక్రవరి, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ

మూసీ నీటి విడుదల



మూసీ ప్రాజెక్టు ఎడమ కాల్వకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు వీరేశం, లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

కేతేపల్లి/సూర్యాపేట రూరల్, జూలై 25: మూసీ ప్రాజెక్టు కింద పంటల సాగు కోసం గురువారం నీటిని విడుదల చేశారు. కేతేపల్లి మండలం పరిధిలోని కుడి కాల్వకు ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి నీటిని వదిలారు. అనంతరం సూర్యాపేట మండలం రత్నపురం గ్రామ పరిధిలోని ఎడమ క్వాలకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. మూసీ ఆయకట్టు కింద రెండు పంటలకు సాగు నీరు అందుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని పేర్కొన్నారు. విడుతల వారీగా అందించే సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మూసీ ప్రాజెక్టు ఎస్ఈ శివధర్మతేజ, డీఈ చంద్రశేఖర్, ఈఈ భద్రూనాయక్, ఏఈలు ఉదయ్‌కుమార్, మమత, స్వప్న, తాసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి, కోతి గోపాల్‌రెడ్డి, దండి రమేశ్, మండడి వెంకట్రామిరెడ్డి, గుత్తా మాధవరెడ్డి పాల్గొన్నారు.

కుడి, ఎడమ కాల్వలకు 150 కూసెక్కుల చొప్పన..

మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 645 అడుగులు కాగా, గురువారం సాయంత్రానికి 642 అడుగులకు చేరింది. 1,189.69 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. కుడి, ఎడమ కాల్వకు 150 క్యూసెక్కుల చొప్పున వదిలారు. ఔట్‌ఫ్లోను రెండ్రోజుల్లో రెండు కాల్వలకు కలిపి మరో 100 క్యూసెక్కులు పెంచనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. పంటల సాగుకు మొదటి విడుతగా 25 రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు.